# రైతులను విస్మరిస్తే మూల్యం తప్పదు

**పంటలను వెంటనే కొనుగోలు చేయాలి**

**నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**

**ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలోనే సర్ ప్రక్రియ**

**బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఓటరు జాబితా ప్రక్షాళన సక్రమంగా జరిగేందుకు అందరూ సహకరించాలని బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు కోరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీజేపీ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమం ఎన్నికల కమీషన్ చేపట్టిందని, దీనికి కేంద్ర ప్రభుత్వానికి ఎలంటి సంబంధం ఉండదని, సీఎం రేవంత్ రెడ్డితోపాటు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు చేస్తున్న ఆరోపణలు చేయకుండా నిజమైన ఓటర్లను ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సూచించారు. 2002లో ఓటరు లిష్టు ప్రక్షాళన చివరిసారిగా జరిగిందని, మళ్లీ 2025లో పలు రాష్ట్రాలలో, 2026లో కొన్ని రాష్ట్రాలలో సర్ జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు దేశంలో 57కోట్ల ఓటర్ల ప్రక్షాళన జరిగిందని, మరో 37కోట్ల ఓటర్ల ప్రక్షాళన జరుగాల్సి ఉందని, అందులో తెలంగాణ ఒక భాగమన్నారు. బెంగాల్ లో సర్ ప్రక్రియ ద్వారా బీజేపీ గెలిచిందనడం తప్పని, ఓటమిని కాంగ్రెస్ అంగీకరించాలన్నారు. సర్ లో అవకతవకలు లేని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, దీనిపై రాజకీయం చేయవద్దని, నిజమైన ఓటర్లని జాబితాలో వచ్చేలా చాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హైదరాబాద్ లో రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, చొరబాటుదారులు ఉన్నారని, వీరిని ఓటరు జాబితాలో రాకుండా బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. తెలంగాణాలో రైతుల పట్ల కాంగ్రెస్ కి చిత్తశుద్ధి లేదని, రైతులు ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న, మామిడి పంటను వెంటనే కొనుగోలు చేయాలని, వర్షాలతో జరిగిన నష్టాన్ని రాష్ట్రం అంచనా వేచి రైతులను ఆదుకోవాలని బీజేపీ చీఫ్ డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని, తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. వాస్తవాలను మాట్లాడకుండా తప్పిదాన్ని కేంద్రంపై నెట్టడం దారుణమని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి కిష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డెప్యుటీ మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, బొడిగె శోభ, కార్పోరేటర్లు, నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, ప్రవీణ్ రావు, ఎన్నం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది బిజెపి ప్రభుత్వమే

**బీజేపీ శిక్షణా తరగతులు ప్రారంభించిన బిజెపి చీఫ్ రామచంద్రరావు**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు అన్నారు. కరీంనగర్ జిల్లాలోని బీజేపీ ముఖ్య నాయకులకు బీజేపీ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతులను శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తిమ్మాపూర్ లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారభించారు. మొదట అమరులైన బీజేపీ నాయకుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆడిటోరియంలో బీజేపీ శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో



గ్రామగ్రామాల బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తూ క్రీయాశీలకంగా వ్యవహరించాలన్నారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఇంటింటా వివరించాలని సూచించారు. తప్పకుండా ప్రధాని మోడీ నాయకత్వంలో బీజేపీని కేంద్రంతోపాటు రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి అందరూ శ్రమించాలని, శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను బీజేపీ నాయకులు పాటించాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు శాంతి కుమార్, గుజ్జుల రామకృష్ణారెడ్డి, బుడిగె శోభ, సుద్దాల దేవయ్య, నగర మేయర్ కొలకాని శ్రీనివాస్, డిప్యుటీ మేయర్ సునీల్ రావు, ఇంచార్జీ కల్లెం వాసుదేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలి

**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు**




కరీంనగర్, మే 30: పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతలో చైతన్యం కల్పిస్తూ, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ లో ముందస్తు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి పాల్గొని శిక్షణ పొందుతున్న యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ధూమపానం చేసే వారితో పాటు వారి చుట్టుపక్కల ఉన్నవారు కూడా పరోక్ష ధూమపానం వల్ల ప్రమాదానికి గురవుతారని తెలిపారు. పొగాకు నియంత్రణ చట్టం--2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని వివరించారు. యువత తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ కేంద్ర సంచాలకుడు డాక్టర్ ఎం. రవికుమార్, వనరుల నిపుణులు ఏ. సంతోష్ కుమార్, గజ్జెల అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని యువత ప్రతిజ్ఞ చేశారు.

# ఇరిగేషన్ బదిలీల్లో అవకతవకలు

**సంఘ నాయకులకు పట్టని జీవోలు**

**ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్**




తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఇరిగేషన్ ఉద్యోగ బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. అయితే బదిలీల్లో సామాన్యులకు అన్యాయం జరుగుతుంటే పలుకుబడి ఉన్నవారికి మాత్రం అందలమేస్తున్నట్లు గుసగుసలున్నాయి. జీవోలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నట్లు, ఉద్యోగ సంఘ నాయకులు బదిలీలు కాకుండా అడ్డదారులు తొక్కుతున్నట్లు విమర్శలున్నాయి. దశాబ్దాలు దాటినా హెడ్ క్వార్టర్ వీడడం లేదనే చర్చ సాగుతోంది. హెడ్ క్వార్టర్ ని పరిగణలోకి తీసుకుని బదిలీలు చేయాల్సి ఉండగా, ఆఫీసు నుండి ఆఫీసు పేరుతో బదిలీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్పౌజ్ బదిలీల్లో సైతం నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాస్థాయిలిని త్రీ మెన్ కమిటీ ఇప్పటికే పలు ఫైళ్లను రిటర్న్ చేసినట్లు సమాచారం. అటెండర్ స్థాయి నుండి సూపరింటెండెంట్ స్థాయి వరకు బదిలీల్లో అవకతవకలున్నాయని, వీటిపై విచారణ చేపడితే అవినీతి, అక్రమాలు బహిర్గతమవుతాయని ఉద్యోగులే చెబుతున్నారు. త్రీమెన్ కమిటీతోపాటు జిల్లా ఉన్నతాధికారులు ఇరిగేషన్ శాఖ బదిలీల్లో పారదర్శకతను పాటించేలా చర్యలు తీసుకోవాలని, పైరవీలకు తావులేకుండా బదిలీలు చేయాలని కొందరు ఉద్యోగులు కోరుతున్నారు.

# కరీంనగర్ నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా జే స్వామి బాధ్యతల స్వీకరణ

**కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి**



కరీంనగర్, మే 30: కరీంనగర్ జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జే స్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జే స్వామికి ఇటీవల ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆయనను కరీంనగర్ జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన డీఆర్వో జే స్వామి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నూతన డీఆర్వోకు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌కు చెందిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మతం మారిన వారికి ఎస్సీ హోదా వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం

**ఎస్సీ హక్కుల పోరాట సంఘం**



కరీంనగర్, మే 30: ఎస్సీ కులాల నుంచి క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా, ఎస్సీ రిజర్వేషన్లు, ఎస్సీ అట్రాసిటీ చట్టం వర్తించవని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎస్సీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. కరీంనగర్‌లో శనివారం ఎస్సీ హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్, రాష్ట్ర నాయకులు డాక్టర్ వంశ తిలక్, దొంతు మల్ల రాంబాబు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, కన్నం శంకర్ పాల్గొన్నారు. సమావేశానికి దావు సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం మతం మారిన ఎస్సీలకు ఎస్సీ హోదా వర్తించదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పును అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసి, క్రైస్తవ మతంలోకి మారిన వారికి జారీ చేసిన ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను రద్దు చేసి, వారికి వర్తించే ఇతర వర్గాల కేటగిరీలలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మతం మారినప్పటికీ ఎస్సీ హోదాను కొనసాగిస్తూ రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్న వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దళిత క్రైస్తవుల పేరుతో నిర్వహిస్తున్న సమావేశాలు, సంఘాల కార్యకలాపాలపై కూడా పరిశీలన జరపాలని ప్రభుత్వాలను కోరారు. నిజమైన దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్ అవకాశాలు వారికి అందేలా చట్టాల అమలులో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మత మార్పిడులను గుర్తించే విషయంలో స్పష్టమైన విధి విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు ఎస్సీ సంఘాల ప్రతినిధులు, సామాజిక నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com